
# సనాతన కాఫీ హోటల్

పి. వి. కృష్ణమూర్తి




అంతా కోలాహలంగా వుంది. పట్టుశాలువాల వాళ్లూ, తడికొళ్లాయి గుడ్డలవాళ్లూ, నూట పదకొండ్లవాళ్లూ, అడ్డపట్టీలవాళ్లూ—ఒకరక మేమిటి నానాడ్రస్సుల్లో పోతున్నారు ఆ యింట్లోకి. దూరాన్నించి మేమిద్దరం చూచి ఆయింట్లో యేదో ఒడుగో పెండ్లో జరుగుతూ వుందిగాబోలు, అందువల్ల యీ 'engagement tax department' వాళ్లంతా వెళ్లుతున్నా రనుకున్నాం ముందు కాని ఆయింటి సమీపంలోకి వచ్చేసరికి గోడకి ఓ పెద్దబోర్డు కనబడింది. దాని మీద పెద్దఅక్షరాల్లో—

సనాతన కాఫీహోటల్

ఇట్లు విధేయుడు,

'సనాతన జనోద్ధారక'

నులక, రామకృష్ణచ్యయనులు

అని వుంది ఇదేదో చాల విచిత్రంగానే వుందే అన్నాడు మా రామమూర్తి.

'లోపలికి వెళ్లి దీనివిషయం కనుక్కుందాం పద' అన్నా నేను. 'నిజమే వినోదినికి పనికి వచ్చే సరుకు దొరుకుతుంది పద' అన్నా డతను. సరేనని సరాసరి లోపలికి పోబోతుంటే ఆ వసారాలో కుక్కిమంచంమీద కూర్చున్న ఓయింగువ భగవాన్లు కొంపలు తగలబడుతున్నట్టుగా 'ఆగండి, ఆగండి' అని గర్జించాడు.

'అనుకున్నంత అయింది సనాతనులకీ మనకీ యెక్కడ కుదురుతుంది పోదాంపద' అన్నా నేను మావాడితో

'ఆ పర్వాలేదు. ఏంచేస్తారో చుద్దాంగా ఉందో నీకెందుకు' అని మావాడు నన్ను ఆపాడు.

'సరాసరి ఆమాల చెప్పులతో లోపలికి పోవడమేనా? పాడుఅలవాట్లు మీారూను ఈ వెధవ యింగ్లీషు చదువులు వచ్చినయి...... ఆకాళ్లవి అక్కడ విడిచి కాళ్లు కడుక్కుని లోపలికి పోండి' అన్నాడాముసలాయన.

మాకప్పుడు కొంచం ధైర్యోత్సాహాలు పుట్టినవి. బూటు విడిచి కాళ్లు కడుక్కున్నాం. మా బూటు కొని అప్పటికి షుమారు ఓ రెండునెలలు మాత్రమే అవడంవల్ల చిత్తం శివుడిమీాద భక్తి చెప్పులమీాద' అన్నట్టు మెల్లిగా లోపలికి చేరాం. అక్కడ వున్నవాళ్లంతా 'అటు! అటు!!' అని ఒక్కసారిగా వూదరపెట్టారు అప్పుడు మేము పక్కగదిలోకి వెళ్లేసరికి ఒకాయన పొడుం పీలుస్తూ ఏదో రాసుకుంటూ కూర్చున్నాడు. మమ్మల్ని చూచి ఆయన—

'ఏంనాయనా ఫలహారం పుచ్చుకుంటారా?' అన్నాడు.

'చిత్తం' అన్నాం మేం సవినయంగా.

'అయితే దొడ్లోకి వెళ్లి స్నానంచేసి రాండి' అన్నాడు.

నాగుండె బేజారైపోయింది ఈచలిలో యిప్పుడు స్నానం యెవరు చేస్తారని అనుకుని 'స్నానం అయిపోయిందండీ' అంటుండంగానే 'ఇంతసేపటిదాకా స్నానం లేకుండానాఅండి?' అని అందుకున్నాడు మావాడు

'అయితే సరే వుండండి' అని 'సుబ్బమ్మా! రెండు కొల్లాయిగుడ్డలు తీసుకురా' అన్నాడు.

వెంటనే వక ధవళవస్త్రకిరీటధారి చెవుల మీాదుగా గుడ్డ లాక్కుంటూ రెండు మకిలి తడికొల్లాయిగుడ్డలు తీసుకువచ్చింది. 'ఇవి కట్టుకోవాలి గాబోలురా భగవంతుడా' అనుకుని అయినా మనబోటివాళ్లు యిటువంటివి లెక్కచెయ్యగూడదని చెరోపాటి కట్టుకున్నాం చలికి వొణుకుతూ.

'ఇలా దయచెయ్యండి' అని ఆవిడ మమ్మల్ని వాళ్లంతా కూర్చున్నచోటికి తీసుకుపోయి కూర్చోమంది అక్కడిదృశ్యం చూచేసరికి, దేవతలూ, రాక్షసులూ, మోహిని యిచ్చే అమృతం త్రాగడానికి బారులు తీర్చి కూర్చున్నట్టుగా గోచరమయింది నాకు లైనుగా పీటలు వేసివున్నవి. వాటిముందు అర్ధవిస్తళ్లూ. అందరికీ రాగిగ్లాసులు వున్నవి. బారులు తీర్చి కూర్చున్నారుశాస్త్రిలుగార్లంతా కొంతమందియెదుట చిన్నసైజు దేముడిమందిరాలు పెట్టుకొని గంట కొడుతూ పూజ చేస్తున్నారు. కొందరు సాలిగ్రామాల్ని కడుగుతున్నారు కొందరు రుద్రాక్షమాలలు ఒళ్లోదాచి అదేపనిగా తిప్పుతున్నారు. కొందరు బకధ్యానం గాబోలు చేస్తున్నారు. 'అంతా బాగానేవుంది. ఇహ మోహినిమాదిరి వ్యక్తి ఛంగుఛంగున వస్తుంది గాబో'లనుకుని ఉవ్విళ్లూరుతూ వుండంగానే యిందాకటి పూర్వసువాసిని రిక్తహస్తాలతో తయారైంది. ఎంతసేపు వూరికే వుండడమని 'యిక్కడ యేందొరు కుతవమ్మా' అని అడిగాను.

“అన్నీ వున్నవి నాయనా, కాంచీపురం యిడ్లీ, తిరుపతి దధ్ధోజనం, మంగళగిరి పులిహోర, శ్రీరంగం పొంగలి, ధనియాల కాఫీ, అన్నీ వున్నవి” అని యాకరుపెట్టింది ఆపేర్లు వినేసరికే నాకొక నూత్నానందం ఉద్భవించింది

‘ఆహా! యెన్నాళ్ళకి విన్నాంరా యీ పేర్లు’ అని అనుకుంటూ వుండంగానే ‘ఏర్పాటు మహా బాగావుందోయ్. తిరపతి పోకుండానే దధ్ధోజనం యిక్కడ లభిస్తూంది. ఏం సౌకర్యం!!!’ అన్నాడు మావాడు.

‘అయితే రెండుప్లేట్లు దధ్ధోజనం తీసుకురాండి’ అనేశా.

‘పీటలెందుకు యింకా? వేసుకు కూర్చున్నారుగా’, అంది

‘పీటలు కాదు ప్లేట్లు’ అన్నా మళ్ళీ

‘అవ్విక్కడ చెయ్యరు’ అంది ఆమె ఆదో రకం పిండివంట గాబోలని

‘సరే యేదో వున్నవేమిటో తీసుకురాండి’ అని ముఖం చిట్లించుకున్నాడు మావాడు

‘కొంచం ఆగండి. అందరికీ ఒకేసారి వడ్డిస్తారు’ అందామె.

‘ఇదేదో గమ్మత్తుగా వుందే అంతా. భోజనంమాదిరి అంతా ఒకసారే తింటారు గాబో’లనుకన్నాం మేం

తర్వాత కొంతసేపటికి ఒహ ఆడమనిషి పళ్ళెంలో అవ్వేవో పదార్థాలన్నీ పట్టుకుని వచ్చి అన్ని విస్తళ్ళల్లో వడ్డించింది అవ్వేం యిడ్లెన్లో! కాంచీపురపు యిడ్లెన్నట! సైజు మన మామూలు గుండ్రాళ్ళమాదిరి వున్నాయి అంతా కూర్చోమంటే కూర్చోమనుకున్నారు. మా చేతులు అమాంతం అప్రయత్నంగా దధ్ధోజనముద్ద ఓ దాన్ని నోటికి అందించినవి ఇట్లా చూద్దుము గదా వాళ్ళంతా అపుపోసన పట్టుతున్నారు టిఫెనుకుగూడా అపుపోసన యెందుకు అని అనుకుంటూ వుండంగానే ఒకాయన పుటిక్కిన అననే అన్నాడు—— ‘మీరు అపుపోసన పట్టరేం?’ అని.

‘మాకింకా ఒడుగు కాలేదండీ’ అన్నాడు మావాడు తడుముకోకండా, నమ్మితే నమ్మారు లేకపోతే లేదని నేను లోలోపల నవ్వుకున్నా. విస్తరిముక్కల్లో పదార్థాలు అయిపోతూ వుండంగానే గ్లాసుల్లో ఓ ద్రవపదార్థం పోసుకువచ్చి యిచ్చారు మేం కొద్దిగా తాగాం ముందు. గొంతులో అల్లపురసం పోసుకుంటే యెంత సౌఖ్యంగా వుంటుందో అట్లా అనిపించింది కళ్ళ వెంబడి నీరు కారింది. ఇటువంటి సందిగ్ధావస్థలో దిగ్భ్రమచెంది వుండంగా ఓ శాస్త్రులుగారు “అక్షయంబుగ కాశిలోపల అన్నపూర్ణ భవానివై * అని జోరుగా వంచేస్తున్నాడు అందరూ త్రాగే త్రాగే గ్లాసులు అట్లాగే పట్టుకుని ఆయన ఆపద్యం ఆపే ఆపడంతోనే ‘కాఫీభోజన కాలే భగవన్నామస్మరణ గోవిందా! గో’వింద’ అని రొద బెట్టారు ఇంకో ఆయన అటుసనాతనుడూ యిటు నవనాగరీకుడు గాకుండా గబ్బిళంజాతి ఆయన ‘కస్తూరీ తిలకం ’ అని మొదలుపెట్టి

పాడుతూవుంటే మధ్యలోనే నేను 'నమఃపార్వతీపతే' అనంగానే 'హరహరమహాదేవ్!' అని పదిమంది గొంతుతో అరిచాడు మావాడు. కొందరు నవ్వారు. ఆగాయకుడు మాత్రం ఉగ్రుడైనాడు. కాని మాక్రాపింగూ అవ్వీ చూసి మళ్లీ పస్తాయించాడు అప్పుడు నేనుగూడా కొంచం హుషార్ చేసి 'స్థిరమైన నడవడి' పద్యాం మొదలుపెట్టా. 'ఛా' Stale music! అదేమిటి!' 'ప్రమదలగూడిమాడగనె పాడవోయ్' అన్నాడు మావాడు. నాకు అకారం అంతగా రాకపోవడంవల్ల, 'దవడకొట్టుడు' అంటే అసహ్యం అవటంవల్ల 'ఆటలాడుకోరా' పాడేశా గబగబా. వాళ్లంతా కోపంగా చూచారు మావంక. మేమేం లెఖ్ఖచెయ్యలేదు వాళ్లని.

కాఫీగూడా త్రాగడం అయింతర్వాత మేం లేవబోతూ వుంటే 'కూర్చో! కూర్చో!!' అనే గంభీరధ్వని మాకర్ణకుహరాల్లో జొరబడింది. వెంటనే చతికిలబడ్డాం. కాస్సేపటికి ఒక స్త్రీ పళ్లెంలో హారతి వెలిగించుకుని వచ్చింది. అందరూ బొడ్లో దాచివుంచిన డబ్బు ఆపళ్లెంలో వేస్తున్నారు. మాదగ్గర కొచ్చేసరికి గుడ్లు మిటకరించాం. మాకేం తెలుసుమరి అప్పుడివ్వాలని? తర్వాత యెట్లాగయితేనేం మాదగ్గర డబ్బు వసూలుచేశారు లెండి.

అంతా అయిపోయిం తర్వాత ఆ హోటలు యజమాని దగ్గరకు వచ్చి 'అయ్యా మీరు సనాతనులు గదా? మీరు కాఫీహోటలు పెట్టడమేమిటి, యీ పెద్దపెద్ద శాస్త్రులుగార్లంతా సూర్యోదయం గాకముందే తినడమేమిటండీ' అని సగౌరవంగా అడిగాను. అయ్యా యీ మధ్య జరిగిన అఖిలభారత సనాతన మహాజన సభలో—మామూలుగా పెళ్లిళ్లు తద్దినాలు జరిగే సమయంలో భోజనాలు చాల ఆలస్యంగా జరగడంవల్ల మావాళ్లకి చాలకష్టంగా వుండడంవల్ల యీమార్గం ఒకటి ఆలోచించబడిందనీ యికనించి ప్రతివూళ్లో యిటువంటివి పెట్టబోతున్నారనీ అన్నాడాయన సరే బాగానే వుందనుకుని 'అయ్యా యిది మధ్యాహ్నంపూటగూడ తెరిచివుంటుందా అండీ' అంటే 'మధ్యాహ్నం తెరిచివుండదు కార్యక్రమాలు జరిగే దినాల్లో మాత్రం రెండుపూటలు తీసివుంటుంది' అన్నాడు

'అయితే యీదర్భాసనా లెందుకండీ?' అన్నా గోడకు తగిలించివున్న వాటిని చూస్తూ

'అవి యెవరైనా పెద్దపెద్ద యజ్ఞాలు అవ్వీ చేసినవారు వస్తే వారికోసం' అన్నాడు

'రోజులెంత మారిపోయినయి!' అని సర్దుకుంటూ వెళ్లిపోయినాం మేం —శలవు!